ప్రజాశక్తి
గురువారం 14 డిసెంబర్ 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

బెదిరిస్తే పోరాటం మరింత ఉధృతం

- అంగన్‌వాడీలకు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల మద్దతు
- సిఎం హామీలు నిలబెట్టుకోవాలి : ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు
- బెదిరింపులకు భయపడేది లేదు : సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా, బెదిరింపులకు పాల్పడితే భయపడేది లేదని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకూ సమ్మె కొనసాగుతుందని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ స్పష్టం చేశారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట, పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని ధర్నా చౌక్‌లో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాలకు కార్యకర్తలు, ఆయాలు రెండో రోజు రెట్టించిన ఉత్సాహంతో హాజరయ్యారు. నల్ల చీరలు ధరించి ఆందోళనలో పాల్గొన్నారు. గుంటూరు, నరసరావుపేటలో శిబిరాలను ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు సందర్శించి మద్దతుగా మాట్లాడారు. గుంటూరులో యూనియన్ నగర కార్యదర్శి

▶ 2లో



నరసరావుపేట, గుంటూరు దీక్ష శిబిరాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సుబ్బరావమ్మ



నందినాటకోత్సవాలను విజయవంతం చేయండి

జిల్లా అధికారులతో సమాచారశాఖ కమిషనర్ విజయకుమార్‌రెడ్డి సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి



నంది నాటకోత్సవాల్లో భాగంగా 23-29 తేదీల్లో గుంటూరులో నిర్వహించే పోటీలకు అన్ని ఏర్పాట్లూ చేయాలని సమాచారశాఖ కమిషనర్ టి.విజయకుమార్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి కోరారు. నాటకోత్సవాలపై కలెక్టరేట్‌లో బుధవారం వారు సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోటీలు, ప్రదర్శనలకు సంబంధించి ప్రభుత్వ పరంగా చేయాల్సిన ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులకు అప్పగిస్తున్నామని, అందరూ సమన్వయంతో పని చేయాలని చెప్పారు. నాటకరంగం, కళలకు గుంటూరుకున్న ప్రాధాన్యతను ఈ పోటీల ద్వారా మరోసారి గుర్తు చేసేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి 38 నాటక బృందాలు వస్తాయన్నారు. అతిథులకు, కళాకారులకు తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. మొత్తం 1200 మంది నటీనటులు పాల్గొంటారని చెప్పారు. వీరికి తగిన వసతులు, ఆహారపానియాలు అందిస్తామన్నారు. కళాకారులకు ఆడిటోరియం వద్ద మెస్ ఏర్పాటు

▶ 2లో

అలరించిన రాయబార ఘట్టం

నేడు మందపోరు, చాపకూడు - హాజరుకానున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

ప్రజాశక్తి - కారంపూడి



పల్నాటి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజైన బుధవారం 'రాయబార ఘట్టం' నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 14 జిల్లాల నుండి వచ్చిన వీరాచారవంతులు వారి పూర్వీకులు నాడు యుద్ధంలో ఉపయోగించిన ఆయుధాలను తీసుకొని నిధి (వీరాచార పీఠం) మీదకు చేరుకున్నారు. పీఠం అధిపతి అయిన పిడుగు తరుణ్ చెన్నకేశవలు ఆధ్వర్యంలో ఆయుధాలను జీవనది అయిన నాగులేరులో స్నానమాచరింపచేసి ఊరేగించారు. అనంతరం సాయంత్రం రాయబార ఘట్టాన్ని బుర్రకథ రూపంలో సందర్శకులకు కళాకారులు

▶ 2లో

కౌలు రైతులకు కొరవడిన భరోసా!

సిసిఆర్‌సి, ఈ-క్రాప్ లేని వారికి సందిగ్ధం - 18 వరకు కొనసాగనున్న పంట నష్టం నమోదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మిచౌంగ్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను గుర్తించి సంబంధిత రైతులకు సాయం అందించేందుకు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. రైతులను పొలంలో ఉంచి ఫొటోలు తీసుకుంటున్నారు. 35 శాతం కంటే ఎక్కువగా పంటనష్టం జరిగితేనే రైతుల వివరాలను, పంట విస్తీర్ణం, సర్వేనంబరు, రైతు ఆధార్ వివరాలను నమోదు చేస్తున్నారు. గ్రామ

▶ 2లో



ఇళ్ల పట్టాల కోసం దశవారీ ఆందోళనలు

- 16 నుండి రిలేదీక్షలను ప్రారంభించనున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- 20న ఎమ్‌టిఎంసి కార్యాలయం వద్ద ధర్నా
- కరపత్రాన్ని ఆవిష్కరించిన సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, ఇతర నాయకులు

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గంలో ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో దశల వారి ఆందోళన చేపట్టినట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు ప్రకటించారు. ఈ మేరకు కరపత్రాన్ని స్థానిక సిపిఎం కార్యాలయంలో నాయకులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు

▶ 2లో



రైతులకు సత్వరమే పరిహారమివ్వాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య
- వరికపూడిశెల పనులు సత్వరమే చేపట్టాలి
- బైపాస్ బాధిత రైతులకు భూసేకరణ చట్టం-2013 ప్రకారం పరిహారం ఇవ్వండి
- పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మిచౌంగ్ తుపానుతో పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం ఇవ్వాలని, వర్షాభావం వల్ల పంటలు సాగు చేయని రైతులకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక

▶ 2లో



కౌలు రైతులకు కొరవడిన భరోసా!

(మొదటి పేజీ తరువాయి)

స్థాయిలో రైతుభరోసా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారి, పంచాయితీ సెక్రటరీ క్షేత్ర స్థాయిలో పొలాలను పరిశీలించి వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న వారి వివరాలతోనే అనుసంధానం చేస్తున్నారు. ఈ-క్రాప్‌లో నమోదైన రైతులకే పరిహారం ఇస్తారని తెలిసింది.

కొంతమంది రైతులకు సంబంధించి కౌలు కొంత భూమి, సొంతంగా కొంత భూమి సాగు చేశారు. పూర్తిగా కౌలుకు భూమి తీసుకుని సాగు చేసిన వారు ఉన్నారు. వీరిలో ఎక్కువ మందికి సిసిఆర్‌సి కార్డుల్లేవు. లక్ష మంది రైతులకు గాను 50 వేల మందికి మాత్రమే సిసిఆర్‌సి కార్డులు ఉన్నాయి. వాస్తవంగా పొలంలో ఏ రైతుంటే ఈ రైతును సర్వే నంబరు, ఆదార్ కార్డు ప్రకారం నమోదు చేయాలని ప్రభుత్వం చెబుతోంది. ఆచరణలో పరిస్థితులు భిన్నంగా ఉంటున్నాయి. మెట్ట ప్రాంతంలో మొదటి కోతకు సిద్ధమవుతున్న తరుణంలో తుపాను వచ్చి పొలాలు నీట మునిగాయి. ప్రధానంగా ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఎన్యూమరేషన్ ఈనెల 18 వరకు ఎన్యూమరేషన్ జరగనుంది. డిసెంబరు 18వ తేదీ నుంచి 22 వరకు సోషల్ ఆడిట్ కోసం సచివాలయాల్లో జాబితాలను ప్రదర్శించనున్నారు. అభ్యంతరాలను స్వీకరించి తుది జాబితాలను ఈనెల 26 ప్రభుత్వానికి పంపనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

వర్షం నీటిలో మిర్చి మొక్కలు నాని పూర్తిగా ఉరకెత్తి పంట దెబ్బతిందని బుధవారం వట్టిచెరుకూరు మండలంలో పర్యటించిన అధికారులకు రైతులు విన్నవించారు. కౌలు, ఇతర పెట్టుబడి కలిపి ఎకరానికి రూ.50 వేలకు పైగా, మిర్చికి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టినట్టు రైతులు తెలిపారు. కోసిన వరిని కళ్లాల్లో ఎండబెట్టగా వర్షం వల్ల పక్కన ఉన్న డ్రెయిన్ పొంగి ధాన్యం మొత్తం నాని పోయి మొలకలెత్తిందని కారంపూడిపాడు రైతులు చెప్పారు. పొలాల్లో నీరు వేగవంతంగా వెలుపలికి వెళ్లేలా వ్యవసాయ డ్రెయిన్లు పూర్తి స్థాయిలో పూడికతీత, అడ్డంకులు తొలగించకపోవడం వల్ల ముంపు సమస్య వచ్చిందని రైతులు వాపోయారు.

నంది నాటకోత్సవాలను విజయవంతం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

చేస్తామన్నారు. పారిశుధ్యం, వైద్య సదుపాయాలు, ఫైర్ సర్వీసు, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డిఆర్‌ఒ చంద్రశేఖర్‌రావు, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఎం.వి.ఎల్. శేషసాయి, గిరిజన సంక్షేమ శాఖాధికారి ప్రభాకర్‌రెడ్డి, డిటిసి కరీం, సాంఘిక సంక్షేమ శాఖ డిడి మధుసూదనరావు, రెడ్‌క్రాస్ వైస్ ప్రెసిడెంట్ రామచంద్రరాజు, గుంటూరు కార్పొరేషన్ అదనపు కమిషనర్ శివజ్యోతి పాల్గొన్నారు. నాటకోత్సవాల తుది ప్రదర్శనల పోటీలు నిర్వహించనున్న శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం, టిటిడి కళ్యాణ మండపాన్ని విజయ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు.

అలరించిన రాయబార ఘట్టం

(మొదటి పేజీ తరువాయి)

కళ్లకు కట్టినట్టుగా వివరించారు. నాడు యుద్ధానికి ముందు రాయబారం కోసం మలిదేవరాజు సమీప బంధువైన అలరాజును పంపగా నాయకురాలు నాగమ్మ కుతంత్రం పని అలరాజును చంపిన ఘట్టాన్ని బుర్రకథగా వివరించారు.

ఉత్సవాల్లో భాగంగా మూడోరోజైన గురువారం మందపోరు కార్యక్రమంలో ఏటా చాపకుడు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ ఆధ్వర్యంలో సహపంక్తి భోజనాన్ని నిర్వహిస్తారు. 11వ శతాబ్దంలోనే కులమతాలు కతీతంగా నాడు బ్రహ్మనాయుడు చాపకుడు సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి ఆచరించాడు. వీరాచార పీఠం ఏర్పడిన దగ్గర నుండి నేటికీ సుమారు 900 ఏళ్లకుపైగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గురువారం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి హాజరు కానున్నారు.

బెదిరిస్తే పోరాటం మరింత ఉధృతం



(మొదటి పేజీ తరువాయి)

బెదిరిస్తే పోరాటం మరింత ఉధృతం

టి.రాధ అధ్యక్షతన జరిగిన సమ్మె శిబిరంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో ఉందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తకు రూ.11500, హెల్పర్‌కు రూ.7 వేలు ఇస్తున్నారని చెప్పారు. తెలంగాణ కంటే అదనంగా వేతనాలు ఇస్తామని జగన్మోహన్‌రెడ్డి వాగ్దానం చేశారని, తెలంగాణలో అంగన్‌వాడీలకు రూ.13650 ఇస్తున్నారని తెలిపారు. వేతనాలు పెంచాలని, సుప్రీం కోర్టు ప్రకారం గ్రాట్యుటీ అమలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీలను నిర్లక్ష్యం చేయొద్దని, తెలంగాణ ఎన్నికల ఫలితాలను గుర్తించాలని, కేవలం 2 శాతం ఓట్లతో ప్రభుత్వం ఓటమిపాలైందని అన్నారు. సిఎం జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కరించాలని కోరారు. సుబ్బరావమ్మ మాట్లాడుతూ సమ్మె ప్రారంభమయ్యాక అధికారుల బెదిరింపు ధోరణిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. చిన్నచిన్న డిమాండ్లు పరిష్కారం చేశామని చెప్పటం సంతోషమేనని, అయితే ప్రధాన సమస్యలను విస్మరించడం సరికాదన్నారు. అంగన్‌వాడీలకు ఇస్తున్న వేతనాలు ఏమాత్రమూ సరిపోవట్లేదని, గ్యాస్, కరెంటు బిల్లులు, నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని, వాటిలో సగం వేతనం సెంటర్ల నిర్వహణకే పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని తెలిపారు. తెలంగాణ కంటే అదనంగా వేతనాలు ఇస్తామని జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు కోసం నాలుగేళ్లుగా శాంతి యుతంగా అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోలేదన్నారు. అంగన్‌వాడీలను బెదిరిస్తే బెదురుతారని అనుకోవటం అపోహేనని, అంగన్‌వాడీల ఉద్యమ చరిత్రను గుర్తెరగాలని హితవు పలికారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమ్మెకు పలు సంఘాలు మద్దతు తెలిపాయి. టిడిపి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నజీర్ అహ్మద్, పత్తిపాడు ఇన్‌చార్జి బి.రామాంజనేయులు మద్దతు పలికారు. అంగన్‌వాడీలకు గతంలో రెండు వేతనాలు పెంచింది టిడిపి ప్రభుత్వం అని గుర్తు చేశారు. వారి న్యాయమైన సమస్యలకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఎల్‌ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు వివికె.సురేష్, ఆర్‌పిల యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి రమాదేవి, ఆటో యూనియన్ నాయకులు జి.శంకర్, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ యూనియన్ నాయకులు నరసయ్య, గౌరవాధ్య క్షులు నికల్సన్ మద్దతు పలికారు. సిఐటియు నాయకులు బి.ముత్యాలరావు, కె.శ్రీనివాసరావు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దీప్తి మనోజ, నాయకులు చిన వెంకాయమ్మ, పద్మ, రమణ, వేదవతి పాల్గొన్నారు.

అంగన్వాడీలు పల్నాడు జిల్లాలో చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని గాంధీపార్కు వద్ద ధర్నా చౌక్‌లో నరసరావుపేట ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు నిరసన తెలిపారు. సమ్మె శిబిరాన్ని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఐసిడిఎస్‌కు నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందని, అంగన్వాడీ వ్యవస్థ నిర్వీర్యమైతే దేశంలో పోషకాహార లోపం పెరిగి ఆకలి సూచిలో భారతదేశం స్థానం మరింత దిగజారుతుందని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులు సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. అనేక యాప్ లు ప్రవేశపెట్టి వర్కర్లపై తీవ్రమైన పని ఒత్తిడి పెంచిందన్నారు. ప్రభుత్వ పెద్దలతో



చర్చించిన క్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి వేతనాల పెంపు, గ్రాట్యుటీ మినహా సిఎం పరిధిలో ఉంటాయన్నారని, మిగతా తమ పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారని తెలిపారు. రాజకీయంగా ముఖ్యమంత్రికి, పరిపాలన అధికారికి ఉద్యోగుల వ్యవహా రంలో నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నా ఆ దిశగా ఆలోచన చేయడం లేదన్నా రు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడిలు 1.20 లక్షల మంది ఉన్నారని, వారి కుటుంబ సభ్యులు కూడా ఉంటారని, ప్రభుత్వం స్పందించకుంటే రానున్న ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కెపి మెటిల్డాదేవి, ఎఐటి యుసి రాష్ట్ర సహాయ కార్యదర్శి హెల్డా ఫ్లారిన్ మాట్లాడుతూ 2017 నుండి పెండి ంగ్‌లో ఉన్న టిఏ, డీఏ బిల్లులు చెల్లించా లని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, ప్రమోషన్లలో రాజకీయ జోక్యం మానుకోవాలని, నాణ్యమైన సెల్ ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటిని పరిష్కరించే వరకూ సెంటర్లను తెరిచే ప్రసక్తే లేదన్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో పోలిస్తే అంగన్వాడీ వర్కర్‌కు ఇచ్చే రూ.11 వేలు, హెల్పర్‌కు ఇచ్చే రూ.7 వేలు ఏ మాత్రం సరిపో వన్నారు. సమ్మెకు మద్దతుగా టిడిపి నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే అంగన్వాడీల సమస్యలు పరిష్కరి స్తామని, సెంటర్లకు నాణ్యమైన సరుకులు ఇచ్చేలా చూస్తామని చెప్పారు. కార్యక్ర మంలో సిఐటియు నాయకులు షేక్ సిలార్ మసూద్, డి.మాధవి, ఎం.కవిత, యు.పద్మ, బివి రమణ, ఎఐటియుసి నాయకులు టి.విజయలక్ష్మి, బి.విజయ కుమారి, కె.రాంబాబు, యు.రంగయ్య, వెంకట్, తెలుగు మహిళా నాయకులు డి.ఉదయశ్రీ, కె.రాధిక పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల కోసం దశలవారీ ఆందోళనలు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం వద్ద 16వ తేదీ నుండి 19వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలు చేస్తామని, 16వ తేదీన దీక్షా శిబిరాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రారంభిస్తారని తెలిపారు. 20వ తేదీన మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ మంగళగిరి కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని, ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. మంగళగిరి నియోజకవర్గంలో కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా వేలాదిమంది 40 ఏళ్ల నుండి వివిధ రకాల ప్రభుత్వ భూముల్లో ఇళ్లేసుకుని నివాసం ఉంటున్నారని, ఇప్పటికీ సుమారు 20 వేల కుటుంబాలకు ఇళ్ల పట్టాలు లేవని అన్నారు. గతంలో టిడిపి, కాంగ్రెస్, ప్రస్తుతం వైసిపి ప్రభుత్వాలు సైతం తాము అధికారంలోకి రాగానే పేదలందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని వాగ్దానాలు చేశారేగాని, ఆచరణలో అమలు చేయలేదని విమర్శించారు. ఇలాంటి ప్రభుత్వాలు పోరాటాల ద్వారా నిలదీయాల్సిన అవసరం ఉందని అన్నారు. మంగళగిరి పట్టణంలో రత్నాల చెరువు, కొండ చట్టు ప్రాంతం, పానకాల స్వామి గుడిమెట్ల వద్ద, పావురాల కాలనీ తదితర ప్రాంతాల్లో సుమారు 6 వేల కుటుంబాలు వివిధ రకాల ప్రభుత్వ భూముల్లో ఇళ్లేసుకుని ఉంటున్నారని, వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాడేపల్లి పట్టణంలోని సుందరయ్య నగర్, కృష్ణ నగర్, రామయ్య కాలనీ, పుష్కరాల సందర్భంగా రోడ్డు మార్జిన్ ఉన్న వారిని తొలగించారని వీరికి ఇంతవరకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇవ్వలేదని అన్నారు. రైల్వే స్థలాల్లో సుమారు 600 కుటుంబాలు ఇల్లు వేసుకుని నివాసం ఉంటున్నారని చెప్పారు. పిడబ్ల్యూడి కట్టలపై సుమారు 1200 కుటుంబాలు వారు నివసిస్తున్నారని తెలిపారు. మొత్తంగా 7 వేల కుటుంబాలకు ఇళ్ల పట్టాలు లేవని వివరించారు. కొండ చుట్టూ ఉన్న ఇళ్లకు రిజిస్ట్రేషన్ల సౌకర్యం లేకుండా చేశారని అన్నారు. మంగళగిరి రూరల్ మండలం ఆత్మకూరులోని నిమ్మగడ్డ రామ్మోహన్‌రావు నగర్, వైయస్సార్ కాలనీ, హనుమాన్ నగర్ తదితర కాలనీలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా, ఇటీవల రోడ్డు వెడల్పు పేరుతో వందలాది కుటుంబాలను అక్కడి నుండి తొలగించారని విమర్శించారు. కాజలో పుల్లయ్య నగర్, సుందరయ్య నగర్ ప్రాంతాల్లో 600 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు లేవన్నారు. పెదవడ్లపూడిలో రైల్వే స్టేషన్ రోడ్‌లో నివాసముండే పేదలను తొలగించేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. దుగ్గిరాల మండలంలో రేవేంద్రపాడు, మోరంపూడి, దుగ్గిరాల తదితర ప్రాంతాల్లో పేదలు ఇరిగేషన్ కట్టలపై దీర్ఘకాలంగా నివాసం ఉంటున్నారని తెలిపారు. నియోజవర్గంలో కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఇరిగేషన్ కట్టలపై సుమారు 3 వేల కుటుంబాలు ఇళ్లేసుకుని నివాసం ఉంటున్నారని, వీరికి పట్టాలు ఇవ్వాలని కోరారు. సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకర్‌రావు, జెవి రాఘవులు మాట్లాడుతూ తాడేపల్లి ప్రాంతంలో వేలాదిమంది ఇళ్ల పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దశల వారి ఆందోళనకు ఈ ప్రాంతం నుండి పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నియోజకవర్గంలో అభ్యంతరం లేని భూముల్లో ఇళ్లేసుకుని జీవిస్తున్న వారికి వెంటనే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రవి మాట్లాడుతూ నిడమర్రు, కురగల్లు, నవులూరు, పెనుమాక, ఎర్రబాలెం గ్రామాల్లో పేదలు ఇళ్లేసుకున్నారని, వారికి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, సీనియర్ నాయకులు ఎం.పకీరయ్య, పి.బాలకృష్ణ, మంగళగిరి, తాడేపల్లి పట్టణ కార్యదర్శులు వై.కమలాకర్, బి.వెంకటేశ్వర్లు, దుగ్గిరాల మండలం కార్యదర్శి జె.బాలరాజు పాల్గొన్నారు.

రైతులకు సత్వరమే పరిహారమివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిపిఎం పల్నాడు జిల్లా విస్తృత సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ అధ్యక్షత వహించగా కృష్ణయ్య మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో కలెక్టర్ గుర్తించిన 17 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి సాయం చేయాలని కోరారు. ఈ మేరకు తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులు, స్కీం వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని, అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని అన్నారు. భవననిర్మాణ కార్మికుల సంక్షేమం బోర్డు నిధులు మొత్తం దారి మళ్లించిందని మండిపడ్డారు. ఆ నిధులను వెంటనే సంక్షేమ బోర్డుకు జమ చేసి భవన నిర్మాణ కార్మికుల క్షైమూలకు రావాల్సిన డబ్బులను చెల్లించాలని, సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను కార్మికులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, పర్మినెంట్ ఉద్యోగులకు ఈ నెల జీతాలింకా చెల్లించలేదని, దీంతో ఆ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. కస్తూర్బా పాఠశాల ఉద్యోగులకు మూణ్ణెల్లుగా వేతనాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలుమార్లు శంకుస్థాపన చేసిన వరికపూడిశెలకు సత్వరమే నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సత్తెనపల్లికి బైపాస్ రోడ్డు రావడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే బైపాస్ రోడ్‌లో భూములు కోల్పోయిన రైతులకు 2013 భూ సేకరణ చట్టం ద్వారా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నరసరావుపేట పట్టణాన్ని పల్నాడు జిల్లా కేంద్రంగా ప్రకటించినా ప్రభుత్వ కార్యాలయాల అధికారాలన్నీ గుంటూరులోనే ఉన్నాయని, వెంటనే ఆయా కార్యాలయాలను, అధికారులను, నిధులు, విధులు కేటాయించి నరసరావుపేట పట్టణాన్ని జిల్లా కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, ఎవిఎన్ గోపాలరావు, ఎస్.ఆంజనేయ నాయక్, సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, నాయకులు జి.బాలకృష్ణ, జి.మల్లీశ్వరి, డి.శివకుమారి, డి.విమల, పి.మహేష్, టి.పెద్దిరాజు, జి.ఉమశ్రీ పాల్గొన్నారు.

ఆర్టీసీలో విలీన అనంతర సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

విలీనం అనంతరం ఆర్టీసిలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కోరుతూ ఆర్టీసీ ఎన్ఎంయుఎ చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ మద్దతు తెలిపింది.బుధవారం గుంటూరు యన్టీఆర్ బస్‌స్టాండ్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి యం.హరిప్రసాద్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు పాత పింఛను అమలుచేయాలని, పింఛను ఆప్షన్ తీసుకోవడం నిరవధికంగా వాయిదా వేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను, లీవు ఎన్ క్యాష్ మెంట్, యస్.బి.టి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అన్నీ తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్తబస్సులు కొనుగోలు చేసి, తక్షణం నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు నిబంధనల ప్రకారం వేతనాలు, సౌకర్యాలు కల్పించాలన్నారు. పెరిగిన అవసరాలకు అనుగుణంగా క్లరికల్ సిబ్బందిని పెంచాలని కోరారు. ఆర్టీసి ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కారం కోరుతూ జరిగే ఉద్యమాలకు ఫెడరేషన్ సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయుఎ జిల్లా కార్యదర్శి యం.యస్.రెడ్డి, ఎల్.వి.యస్.రావు, రామ కృష్ణ, శ్రీనివాస్, ఫెడరేషన్ నాయకులు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎంయుఎ ఆందోళనకు మద్దతుగా పాల్గొన్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు



ఆందోళన చేస్తున్న ప్రధానోపాధ్యాయులు

గ్రాంట్ల విడుదలలో జాప్యంపై హెచ్ఎంల ఆందోళన

ప్రజాశక్తి-గుంటూరు :పాఠశాలలకు నిర్వహణకు సంబంధించిన గ్రాంట్లు విడుదలలో జాపాన్ని నిరశిస్తూ ప్రధానోపాధ్యాయులు బుధవారం జిల్లా వాప్యంగా ఆందోళన చేపట్టారు. గుంటూరు గవర్నమెంట్ ఉర్దూ హైస్కూలు, పులిపాక ప్రభుత్వ హైస్కూల్లో, అలాగే మంగళగిరి, తెనాలి పలు చోట్ల పాఠశాల కాంప్లెక్స్ మీటింగ్‌ల సందర్భంగా మధ్యాహ్న భోజన సమయంలో ప్రధానోపాధ్యాయులు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షులు ఆవుల తిరుమలేష్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు గడిచినా ఇంతవరకూ పాఠశాలల నిర్వహణ నిధులు విడుదల చేయలేదన్నారు. గత సంవత్సర బకాయిలు, ఈ సంవత్సర నిధులు ఏకమొత్తంగా వెంటనే విడుదల చేయాలన్నారు. పాఠశాల విద్యాశాఖ మంత్రి ప్రకటించిన విధంగా పాఠశాలల విద్యుత్ బిల్లులు ప్రభుత్వమే చెల్లిస్తుందని ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో బోధనేతర సిబ్బందిని నియమించాలని, ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లించాలని, నాడు-నేడు పనులు పూర్తి చేయటానికి నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రదాన కార్యదర్శి బి.సత్యం, కోశాధికారి పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శారదా కాలనీ ప్రధాన రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలోని శివారు ప్రాంతాలు, విలీన గ్రామాల అభివద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు తెలిపారు. బుధవారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 50వ డివిజన్‌లోని శారదా కాలని ప్రధాన రహదారికి రూ.1కోటి, 21లక్షల 50వేలతో సి.సి రోడ్డు నిర్మించుటకు స్థానిక ప్రజలతో కలిసి శంఖుస్థాపన చేశారు.ఈ రోడ్డు నిర్మాణం చేయటం వల్ల స్థానిక ప్రజలకే కాక, మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్‌రోడ్డు వైపు వెళ్ళటానికి, అమరావతి రోడ్డువైపు వెళ ్ళటానికి అనువుగా ఉంటుందని తెలియచేశారు. ఇప్పటికే సదరు ప్రాంతంలోని సైడు కాల్వలు నిర్మాణం పూర్తి అయ్యిందని, ప్రస్తుతం సదరు ప్రాంతంలో రోడ్డు మార్జిన్లలో ఆక్రమణలు తొలగించి, రోడ్డు విస్తరించి సిసి రోడ్డు నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్ర బాబు, వై.ఆ.ఆర్.సి.పి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా, ఈ.ఈ కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మగడ్డ రామ్మోహనరావుకు నివాళి

ప్రజాశక్తి - తుళ్లూరు

నిమ్మగడ్డ రామ్మోహన్ రావు 15వ వర్ధంతి పురస్కరించుకొని రాజధాని లోని నిడమర్రు లో బుధవారం సాయంత్రం నిమ్మగడ్డ చిత్రపటానికి సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, కార్యదర్శి వర్గ సభ్యులు ఎం భాగ్య రాజు, కట్టె పోగు ప్రకాష్ రావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మంగళగిరి ప్రాంతంలో రైతులకు, కార్మికులకు, పేదలకు ఏ ఇబ్బంది ఎదురైన అవి పరిష్కారం అయ్యేవరకు వారి కి అండగా నిమ్మగడ్డ నిలిచేవారని అన్నారు.ప్రజా ప్రతినిధిగా ఉన్న సమయంలోపాఠశాలలు, మంచినీరు, రోడ్లు, వంతెనలు నిర్మించారని అన్నారు. నిమ్మగడ్డ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కోరారు.

నెహ్రూ నికేతన్‌లో క్రీడా పోటీలు

ప్రజాశక్తి- తెనాలి

స్థానిక బోస్ రోడ్ లోని నెహ్రూ నికేతన్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం క్రీడా పోటీలు నిర్వహించారు. మేనేజింగ్ డైరెక్టర్ మురళి కాంత్ దాసరి పర్యవేక్షణలో బాలురు లాంగ్ జంప్, హైజంప్, కోకోలో పాల్గొనగా, బాలికలు కోకో పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ వి శేషగిరిరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి షేక్ షబీనా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్ నెహ్రూ నికేతన్ వ్యవస్థాపకులు డి ప్రకాశరావు, అధ్యాపక, ఉపాధ్యాయ బందం పాల్గొన్నారు.

25వేల ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు



సమాశంలో మాట్లాడుతున్న కుమ్మర క్రాంతికుమార్

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక చుట్టుగుంటలోని బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికల ఇచ్చిన హామీ ప్రకారం మెగా డిఎస్‌సి, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని ఎపిపిఎస్‌సి ఉద్యోగాలకు వయోపరిమితి 47 ఏళ్లకు పెంచాలని కోరారు. గ్రూప్-2 రెండువేల పోస్టులు ఖాళీగా ఉంటే 870 పోస్టలకు నోటిఫికేషన్ ఇవ్వటం దారుణమన్నారు. తాజాగా ప్రకటించిన గ్రూప్-1, 2 నోటిఫికేషన్లు ఎన్నికల స్టంట్ అని పేర్కొన్నారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించని పక్షంలో డిసెంబర్ 20 తర్వాత ఆందోళనలు చేపడతామని చెప్పారు. సమావేశంలో నిరుద్యోగ ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ కె.వి.సుబ్రహ్మణ్యం, బిసి సంక్షేమ సంఘం యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కె.హనుమంతరావు, నాగుల్ మీరా, సుబ్బరాజు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎంపిడిఓ కన్నుమూత

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

గుండెపోటుతో ఎంపీడీఓ మృతి చెందాడు. పల్నాడు జిల్లా పంచాయతీరాజ్ రిసోర్స్ సెంటర్ ఎంపిడిఓ కంభా బ్రహ్మయ్య (59) గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలానికి చెందిన బ్రహ్మయ్య బెల్లంకొండ ఎంపిడిఓ గా పనిచేస్తూ డెప్యూటేషన్ పై రిసోర్స్ సెంటర్ ఎంపిడిఓగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో గుండెపోటు రావడంతో గుంటూరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న సత్తెనపల్లి ఎంపిడిఓ జీవి సత్యనారాయణ, బెల్లంకొండ ఎంపిడిఓ వెంకటరెడ్డి కార్యాలయం సిబ్బంది బ్రహ్మయ్య భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం ప్రకటించారు. మృతునికి భార్య రాములమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరణలో కావటి, శివారెడ్డి తదితరులు

జనవరి 26 నుంచి ప్రాపర్టీ షో

గుంటూరులో మూడు రోజుల పాటు నిర్వహణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

క్రెడాయ్ గుంటూరు చాప్టర్ ఆధ్వర్యంలో జనవరి 26,27,28 తేదీల్లో స్థానిక సిద్ధార్ధగార్డెన్స్‌లో ప్రాపర్టి షో నిర్వహించనున్నట్టు చాప్టర్ ప్రెసిడెంట్ మామిడి రాము తెలిపారు. గుంటూరులోని ఒక హోటల్‌లో బుధవారం మేయర్ కావటి మనోహర్ నాయుడు, క్రెడాయ్ రాష్ట్ర చైర్మన్ ఆళ్ల శివారెడ్డి, ప్రాంతీయ చైర్మన్ ఎ.సతీష్ రెడ్డి,కార్యదర్శి వినోద్ రెడ్డి ప్రాపర్టి షో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆళ్ల శివారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వివిధ సంస్థలకు చెందిన హౌసింగ్ ప్రాజెక్టులలో నాణ్యమైన అపార్టుమెంట్స్‌ను , ఇళ్ల స్థలాలను కస్టమర్లు పొందటానికి అవకాశం ఉంటుందన్నారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ గుంటూరులో సామాన్య, మధ్యతరగతి ప్రజల సొంత ఇంటి కల నెరవేర్చడానికి క్రెడాయ్‌కు తమ వంతు సహకారం అందిస్తాం అన్నారు. బిల్డర్లు ఎన్‌వోసిలు, పర్మిషన్లు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల (ఒసి) సమస్యలను ఆయనకు విన్నవించగా త్వరలో ఈ సమస్య పరిష్కరిస్తామన్నారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల (ఒసి) జారీలో జాప్యాన్ని నిరోధిస్తామన్నారు. అరుమళ్ల సతీష్ రెడ్డి మాట్లాడుతూ ప్రాపర్టీ షోలో అన్ని వర్గాల వారికి గృహ రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు వస్తున్నారని తెలిపారు. వ్యవసాయ రంగం తరువాత నిర్మాణ రంగంలోనే ఎక్కువ మంది కార్మికులకు ఉపాధి దొరుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఎం.ఎస్.వి.కార్తిక్, ఉపాధ్యక్షులు మెట్టు సాంబశివారెడ్డి, దేవరశెట్టి సురేష్ బాబు, జాయింట్ సెక్రటరీస్ పి.శివనాగేశ్వరరావు, ఎ.వి.నాగార్జునరెడ్డి, ప్రాపర్టీషో కన్వీనర్ జి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి - రెంటచింతల

సమగ్ర శిక్ష అభయాన్‌లో పని చేస్తున్న వివిధ కేటగిరీల ఉద్యోగులకు నాలుగు నెలల నుంచి జీతాలు లేకపోవడంతో సమ్మెకు సిద్ధమయ్యారు అందులో భాగంగా బుధవారం ఎంఇఒ-2 శివ నాగేశ్వరరావుకు సమ్మె నోటీసు అందజేశారు ఈ నెల 16న పెన్‌డౌన్ చేసి 20 నుంచి నిరవధికంగా సమ్మెలో పాల్గొంటామని నోటీసులో పేర్కొన్నారు కేజీబీవీ, భవిత, సీఆర్పీలు డేటా ఎంట్రీ ఆపరేటర్లు మొత్తం 33 మంది దాకా ఉన్నామని, తామంతా ఆందోళనకు సిద్ధమయ్యామని సంఘం నాయకులు ఎన్.మంగయ్య తెలిపారు.

మున్సిపల్ కార్మికురాలు మృతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మున్సిపల్ ఔట్సోర్సింగ్ కార్మికురాలు సోగాల రమణ (40) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆమె మూణ్ణెల్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. నిరుపేదరాలైన ఆమె మందులు వాడుకుంటున్నా సరైన పోషణ లేక ఆరోగ్యం క్షీణించి మృతి చెందారు. రమణకు ఒక కుమారుడు ఉన్నారు.. విషయం తెలుసుకున్న సిఐటియు నాయకులు షేక్ సిలార్ మసూద్, అవ్వారు ప్రసాదరావు బుధవారం ఉదయం రమణ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ రమణ మరణంతో ఆమె కుమారుడు దిక్కులేని వాడయ్యే ప్రమాదం ఉన్నదని, అతనికి మున్సిపాలిటీలో ఉద్యోగం ఇవ్వాలని కోరారు. రమణ మృతికి ఎక్స్‌గ్రేషియోగా రూ.లక్ష ఇవ్వాలని, మట్టి ఖర్చులు రూ.15 వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రమణ అంత్యక్రియలు బుధవారం సాయంత్రం జరిగాయి. సిఐటియు నాయకులు షేక్ సైదులు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు సిహెచ్.పెద వెంకయ్య, కార్మికులు జె.రమేష్, ఎన్.స్వామి, ఎ.డేవిడ్ పాల్గొన్నారు.




నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

క్విజ్ పోటీల్లో జెడ్‌పి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని 75 త్యాళ్ళూరు జెడ్‌పి పాఠశాల విద్యార్థులు పీవి శివాంజన్, వెంకట మణికంఠ భారత ప్రభుత్వం జాతీయ స్థాయిలో నిర్వహించిన 'ది ఇండియన్ నేవీ క్విజ్' క్వార్టర్ ఫైనల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి అచీవ్మెంట్ సర్టిఫికెట్లు బుధవారం పొందారని హెచ్ఎం అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు కె.వి సుబ్బారావు తెలిపారు. దేశ వ్యాప్తంగా 12 మంది విద్యార్థులు ఈ క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారికి శిక్షణిచ్చిన ఉపాధ్యాయులను హెచ్ఎంతోపాటు పిసి చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు





ఐక్యంగా పోరాడి విజయం సాధించండి

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య
- రెండో రోజుకు అంగన్వాడీల సమ్మె
- శిబిరాలను సందర్శించి మద్దతు తెలిసిన సిపిఎం, ప్రజా సంఘాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

అంగన్వాడీలంతా ఐక్యంగా పోరాడండి విజయం సాధించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య అన్నారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా అంగన్వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం రెండో రోజుకు చేరింది. ఇందులో భాగంగా స్థానిక స్థానిక తాలూకా సెంటర్లో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని సిపిఎం నాయకులు సందర్శించి తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ అంగన్వాడీల పట్ల పాలకవర్గ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఒకరకంగానూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడుతూ మోసం చేస్తూనే ఉన్నాయని విమర్శించారు. అయినా ఐక్యంగా పోరాడి విజయం సాధించిన సందర్భాలు అనేక ఉన్నాయని గుర్తు చేశారు. సిపిఎం మండల కార్యదర్శి పి.మహేష్ మాట్లాడుతూ వేతనాలు పెంచలేము, గ్రాట్యుటీ ఇవ్వలేము అని ప్రిన్సిపల్ సెక్రెటరీ చెప్పడం అన్యాయమన్నారు. ఈ రెండు ముఖ్యమైన డిమాండ్లను పరిష్కరించే దాక పోరాడాలని చెప్పారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ప్రాజెక్ట్ అధ్యక్షులు జి.సుజాత, కార్యదర్శి అహల్య, సత్తెనపల్లి సెక్టర్ లీడర్స్ విజయలక్ష్మి, సుధారాణి, అమల, ధనలక్ష్మి, దుర్గ భవాని, అంగన్వాడిలు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - చిలకలూరిపేట

తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం కొనసాగింది. శిబిరానికి యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు జి.సావిత్రి అధ్యక్షత వహించారు. సమ్మెకు మద్దతుగా రైతు సంఘం సీనియర్ నాయకులు బొల్లు శంకర్రావు, రాష్ట్ర గిరిజన సంఘ ఐక్య వేదిక అధ్యక్షులు బి.శ్రీను నాయక్ మాట్లాడారు. యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి కె.రమాదేవి, నాయకులు ఎం.విల్సన్, పెద్దఎత్తున అంగన్వాడీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జి.సుజాతకు వినతిపత్రం ఇచ్చారు.

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరులోని ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద రెండవ రోజు సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు మానవహారంగా ఏర్పడ్డారు. సిఐటియు మండల అధ్యక్షులు కె.వెంకటరమణ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని పేరారెడ్డి పెట్రోల్ బంక్ సమీపంలో అంగన్వాడీ వర్కర్స్ శిబిరం ఏర్పాటు చేసి సమ్మెను కొనసాగిస్తున్నారు. యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు షేక్ హజ్రా, డి.శాంతమణి మాట్లాడుతూ తెలంగాణలో కంటే మెరుగైన వేతనాలు ఇస్తామని హామీనిచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటివరకు ఒక్క రూపాయి పెంచలేదని విమర్శించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీని వెంటనే అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సదుపాయాలు కల్పించాలని కోరారు. ఫేస్‌యాప్‌ను వెటంటనే రద్దు చేయాలని, నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు శివరంజని, కవిత, వెంకటరమణ, కె.జోష్ణ, శాంతికుమారి, జయశ్రీ, హసీనా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సుమారు 500 మంది అంగన్వాడీలు నిరసన తెలిపారు. తొలుత పట్టణంలో భారీ ర్యాలీ చేశారు. యూనియన్ అధ్యక్షులు గోవిందమ్మ (ఉష) మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి చాలీచాలని జీతాలతో పని చేస్తున్న తమపట్ల ప్రభుత్వాలు కనీసం జాలైనా చూపడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. సమస్యలను పరిష్కరించేదాక పోరాడతామన్నారు. వీరికి సిఐటియు నాయకులు బి.మహేష్ మద్దతు తెలిపారు.





ప్రజల ఆకాంక్షలు, సమస్యలు తెలుసు

అందర్నీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తా : వైసిపి చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త రాజేష్ నాయుడు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల వారిని సమన్వయం చేసుకొని పార్టీ ప్రతిష్టను మరింత పెంచేందుకు కృషి చేస్తానని ఆ పార్టీ నియోజకవర్గ నూతన సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు అన్నారు. స్థానిక ఎన్ఆర్‌టి సెంటర్‌లోని వైసిపి కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, వైసిపి పార్టీ నాయకులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. తనను నియమించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, అందుకు సహకరించిన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, లేళ్ల అప్పిరెడ్డికి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఇతర నాయకులకు కృతజ్ఞతలని చెప్పారు. ప్రతిఒక్కర్నీ వ్యక్తిగతంగా కలుస్తానన్నారు. నియోజకవర్గంలోని ప్రజల ఆకాంక్షలు, సమస్యలు తెలుసని, వాటి పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లోనూ వైసిపి అత్యధిక మెజార్టీతో గెలిచేలా ముందుకెళ్తానన్నారు. సమావేశంలో వైసిపి నియోజకవర్గ బూత్ కన్వీనర్ విడదల గోపీనాథ్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, వైస్‌చైర్మన్ వి.వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి కె.సుధారాణి, నాయకులు కె.మస్తాన్‌రావు, ఎం.వాసు, డి.శంకరావు, టి.రాణి, పి.ఝాన్సీరాణి, షా, బేరింగ్ మౌలాలి, ఎం.విశ్వనాథం, ఎన్.శ్రీనివాసరావు, దరియావలి, జి.వేములయ్య, వి.కమలేంద్ర, కౌన్సిలర్లు కరిముల్లా, కోట్యానాయక్, యూసుఫ్, విల్సన్, సిహెచ్.పార్వతిదేవి, మీరాబి, వై.సుజాత, కో-ఆప్షన్ సభ్యులు పి.మస్తాన్‌రావు పాల్గొని రాజేష్‌నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా ఉండగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు యనమల భార్గవి మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.



సమావేశంలో రాజేష్‌నాయుడు, ఇతర నాయకులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి
గుంటూరు 5
గురువారం 14 డిసెంబర్ 2023

బెదిరింపులకు భయపడం - రెండో రోజూ అదే పోరు

సమ్మెకు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు - బెదిరింపు సర్క్యులర్‌లను వెనక్కు తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి - మంగళగిరి

అంగన్వాడీలను రాష్ట్ర ప్రభుత్వం బెదిరిస్తూ ఇచ్చిన సర్క్యులర్లను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ అన్నారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడి యూనియన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. మంగళగిరిలో అంబేద్కర్ సెంటర్లో నిరవధిక సమ్మె శిబిరాన్ని బుధవారం ఆమె సందర్శించి ప్రసంగించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు అంగన్వాడీలకు తెలంగాణ కన్నా వేతనాలు అదనంగా పెంచుతానని హామీ ఇవ్వడం జరిగిందని ఇంతవరకు నెరవేర్చలేదని అన్నారు. సమ్మె ప్రారంభమైన తర్వాత బెదిరిస్తూ ప్రభుత్వం సర్క్యులర్లను విడుదల చేయడం దారుణమైన అన్నారు. అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని టిడిపి ఆధ్వర్యంలో నాయకులు సందర్శించి మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, దామర్ల రాజు, కారంపూడి అంకమ్మరావు, ఎం రమేష్, తోట పార్థసారథి, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు. సమ్మె శిబిరాన్ని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం ఎ చిష్టి సందర్శించి మద్దతు తెలియజేసి మాట్లాడారు. మహిళా సంఘం నాయకులు భీమిరెడ్డి కోటేశ్వరి, వల్లూరి భారతి, సింహాద్రి సుమ, సింహాద్రి నిర్మల సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేసి మాట్లాడారు. శిబిరాన్ని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య, ఎం రవి, సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వై కమలాకర్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలాజీ, సిపిఎం సీనియర్ నాయకులు ఎం పకీరయ్య సందర్శించి మద్దతు తెలియజేశారు.

ప్రజాశక్తి-పెదకాకాని రూరల్

అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రెండ రోజు సమ్మె కొనసాగింది. శిబిరాన్ని అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె సుబ్బరావమ్మ, సిఐటియు నాయకులు నన్నపనేని శివాజి సందర్శించి ప్రసంగించారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సిపిఎం అండగా ఉంటుందని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం సమీపంలో రెండో రోజు జరిగిన అంగన్‌వాడీల నిరసన దీక్షా కార్యక్రమానికి ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. ఐదు సంవత్సరాల క్రితం ఇప్పటి సిఎం అంగన్‌వాడీలకు తెలంగాణ రాష్ట్రం కంటే అధికంగా జీతాలిస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కదలి రాకుంటే బిజెపి మినహా కలిసి వచ్చేరాజకీయ పార్టీలతో అఖిలపక్షంగా చర్చించి అంగన్‌వాడీలకు మద్దతుగా పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఆవాజ్ జిల్లా నాయకులు చిష్ట, టిడిపి నాయకులు డి.జ్యోతిబసు, సుందరయ్య సేవా సమితి తాడేపల్లి కన్వీనర్ గాదె సుబ్బారెడ్డి, సిఐటియు నాయకులు డి.వెంకటరెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు, ఎ.శౌరిబర్తులం, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డి.శ్రీనివాసకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తమ న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలంటూ రెండవరోజు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ మద్దతు తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు నల్లచీరెలతో ధర్నా చేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు హుస్సేన్ వలి, యూనియన్ అధ్యక్షులు అనురాధ, కార్యదర్శి ఎవి ఎన్ కుమారి, ఎలిజెబెత్ రాణి, హైమావతి, నగరాజ కుమారి విజయలక్ష్మి, పావని పాల్గొన్నారు.





మంగళగిరి శిబిరంలో పాల్గొన్న కె.సుబ్బరావమ్మ









ప్రజాశక్తి - వట్టిచెరుకూరు

మండల కేంద్రంలో సమ్మె శిబిరం కొనసాగింది. కార్యక్రమంలో ప్రత్తిపాడు ప్రాజెక్టు కార్యదర్శి ఏ పద్మ, మండల కార్యదర్శి నవరత్నమణి, నాయకులు ధనలక్ష్మితదితరులు నల్ల చీరలు ధరించి నిరసన వ్యక్తం చేశారు

ప్రజాశక్తి - తుళ్లూరు

ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) మద్దతు తెలిపింది. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహిస్తున్న సమ్మెను ఉద్దేశించి యుటిఎఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడారు. .

ప్రజాశక్తి - పెదనందిపాడు

అంగన్వాడీల నిరసన దీక్షలకు సిఐటియు జిల్లా నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, పిఎన్ఎం జిల్లా కార్యదర్శి డి శ్రీనివాసరావు, నాయకులు సరిశెట్టి ఆచార్యులు, మాజీ ఎంపిపి నగరాజకుమారి మద్దతు తెలిపారు.

ప్రజాశక్తి పొన్నూరు రూరల్

పొన్నూరులో సమ్మె శిబిరానికి నాయకులు నిమ్మకూరి రమేష్, బండ్లమూడి లక్ష్మీ రాధాదేవి మద్దతు తెలిపి ప్రసంగించారు.

ప్రజాశక్తి - తాడికొండ

అంగన్వాడీ దీక్షలకు స్నేహ ఆటో యూనియన్ అధ్యక్షులు కె జగ్జీవన్‌రావ్, సిఐటియు, రైతు సంఘం నాయకులు ఎడ్లపల్లి గాంధీ రామ్మోహనరావు, చింతల భాస్కరరావు మద్దతు తెలివి ప్రసంగించారు.

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండలం లో రెండో రోజు సమ్మెకు పలువురు మద్దతు తెలిపారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు వి.నాగరాజకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో , సిఐటియు జిల్లా కార్యదర్శి బి లక్ష్మణరావు, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు తిమ్మాపురం సర్పంచ్ కల్లూరి శ్రీనివాసరావు, కోయవారిపాలెం, తిక్కిరెడ్డిపాలెం సర్పంచ్ మద్దతు తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి చెల్లి రమేష్ మద్దతు తెలిపారు.

ప్రజాశక్తి-కొల్లిపర

అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన కోరికలను వెంటనే నెరవేర్చాలని సిఐటియు జిల్లా నాయకులు వై నేతాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె రెండవ రోజున కొల్లిపరలోని కచేరి సావిడి వద్ద అంగన్వాడి సమ్మె శిబిరాన్ని వై నేతాజీ సందర్శించి తమ మద్దతు తెలిపారు కార్యక్రమంలో సిపిఎం నాయకులు ములక శివ సాంబిరెడ్డి, కోటా చంద్రశాఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

అంగన్వాడీల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించక పోయినట్లయితే అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలను కలుపుకొని ప్రభుత్వ యంత్రాంగాన్ని స్తంభింప చేస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి వై నేతాజీ అన్నారు. స్థానిక తాసిల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన నిరసన రెండో రోజున ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు మండల ఉపాధ్యక్షుడు జట్టి బాలరాజు జి శ్రీనివాసరావు పి జయ సిహెచ్ నాగమణి జె సునీత వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఫిరంగిపురం

ఆంధ్ర ప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఫిరంగిపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం అంగన్వాడీలు హెల్పర్స్ అండ్ వర్కర్స్ నిరవధిక సమ్మెను సిఐటియు మండల కార్యదర్శి షేక్ మస్తాన్ వలి నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన మండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు సమ్మె శిబిరం వద్దకు వచ్చి సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి అక్కా చెల్లెమ్మలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచుతానన్న ముఖ్యమంత్రి హామీ నీటి మీద వ్రాతగా మిగిలిపోయిందన్నారు. 2022లో సుప్రీంకోర్టు అంగన్వాడీలకు గ్రెడ్యూటీ అమలు చేయాలని తీర్పు ఇచ్చినప్పటికీ ఈరోజు కూడాను అది అమలు కాలేదు. సెంటర్లో నిర్వహణకు అంగన్వాడీలు పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితులు నెలకొని ఉందన్నారు. మీరు చేస్తున్నటువంటి న్యాయమైనటువంటి డిమాండ్ ను పరిష్కరించే అందుకే శాసనమండలిలో తెలియజేసా మన్నారు. కార్యదర్శి విజయ్ కుమారి మాట్లాడుతూ అంగన్వాడీల నిరవదధిక సమ్మెను సమస్యలు పరిష్కరించే వరకు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు పి రజిని, రాఘవ, నందిని, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు : చేబ్రోలు మండలంలో జరుగుతున్న అంగన్వాడీ కార్యకర్తల రెండవ రోజు సమ్మెకు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి ని ఖండిస్తున్నామని అన్నారు. తక్షణమే వారి డిమాండ్ లను పరిష్కారంచాలని కోరారు. కార్యక్రమములో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైలా వెంకట రామరాజు ,ప్రధాన కార్యదర్శి అనంత లక్ష్మి నారాయణ, చేబ్రోలు ఎంపీటీసీ పఠాన్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.



















నివాళులర్పిస్తున్న ఎంఈఓ,యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయుడు అజయ్ బాబు మృతి

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని కొండ్రముట్ల గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు చేకూరి అజయ్ బాబు (58) అనారోగ్య కారణంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మంగళవారం మతి చెందారు. అజయ్ బాబు మతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఎంఈఓ బాబురెడ్డి, పల్నాడు జిల్లా యూటీఎఫ్ అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ యూటీఎఫ్ సంఘ స్పృహ, సామాజిక బాధ్యత, వృత్తిపట్ల నిబద్ధత కలిగిన అజయ్ బాబును కోల్పోవడం బాధాకరమన్నారు. మండలంలో యుటిఎఫ్ సంఘం బలోపేతం చేయడంలో అజయ్ బాబు కృషి ఎనలేనిదన్నారు. అనేకమంది ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను యుటిఎఫ్ కార్యకర్తలుగా మలచి ఉద్యమ స్ఫూర్తిని వారిలో నింపారన్నారు. నివాళులర్పించిన వారిలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎం రవిబాబు, ఆర్ అజయ్ కుమార్, నియోజకవర్గ యుటిఎఫ్ బాధ్యులు ఉన్నారు.

శిరిగిరిపాడు-నర్సరావుపేట బస్సు టైమింగ్స్ మార్చండి

ప్రజాశక్తి-మాచర్ల

శిరిగిరిపాడు నుండి పల్నాడు జిల్లా కేంద్రమైన నర్సరావుపేటకు టైమింగ్స్ మార్చవలసిందిగా, గోట్టిపాళ్ళ నుండి గుంటూరుకు నేరుగా బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్.రామాంజనేయులు, ఎం సురేష్‌లు కోరినట్లు ఆర్.టి.సి డిపో మేనేజరు ఆర్ పిచ్చయ్య తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ డిఎం కార్యక్రమానికి ఆరు ఫిర్యాదులు ప్రజల నుండి అందినట్లు తెలిపారు. మాచర్ల నుండి హైదరాబాద్‌కు డీలక్స్ బస్సును ఏర్పాటు చేయాలని, మండల కేంద్రాలైన దుర్గి, రెంటచింతల, వెల్దుర్తిలలో బస్సు షెల్టర్స్ ఏర్పాటు చేయాలని, మార్కపురానికి సాయంత్రం 7 గంటల తరువాత బస్సు సౌకర్యం కల్పించాలని తదితర ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ప్రజల నుండి వచ్చిన అభ్యర్ధనలను ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారం చేయనున్నట్లు డిఎం పిచ్చయ్య వివరించారు.



వైసిపి యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పిన్నెల్లి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-మాచర్ల

ఎపి వైసిపి యువజన విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, కార్యదర్శిగా మాచర్లకు చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డిలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి, రఘురామిరెడ్డిలను వీరిని పార్టీకి చెందిన పలువురు అభినందించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ మళ్లీ గెలిచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యువజన కార్యకర్తలు శ్రమించేందుకు కృషి చేస్తామని వారు చెప్పారు.

18 లోగా పంటల నష్టపరిహారం నమోదు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఇటీవల సంబంవించిన మిచౌంగ్ తుఫాను నేపథ్యంలో నష్టపోయిన పంటల అంచనా వివరాలు నమోదు పార దర్శకంగా జరగాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి వ్యవసాయ శాఖ అధికారులకు, సహాయకులకు సూచించారు. నరసరావుపేట మండలంలోని కేతిముక్కల అగ్రహారంలో నష్టపోయిన పంటల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ఈ నెల 18 లోగా ఆయా పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులు రైతు భరోసా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించి దెబ్బతిన్న పంటల ఎన్యూమరేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 22న సామాజిక తనిఖీ నిమిత్తం రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. అభ్యంతరాలు ఏమైనా సరి చేసి 23 న తయారు చేసిన జాబితాను జిల్లా కలెక్టర్ ద్వారా కమిషనర్ కు ఇన్పుట్ సబ్సిడీ కోసం పంపించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం శనగ సాగుకు సరైన సమయం కావడంతో దెబ్బతిన్న శనగ దున్ని వేసి మళ్ళీ శనగ సాగు చేసే రైతులకు రాయితీ పై శనగ విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట ఎడిఎ పి.మస్తానమ్మ, నరసరావుపేట మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు, ఏఈఓ కె. బ్రహ్మయ్య, పి.పవన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నకరికల్లు

మండలంలోని దేచవరం చల్లగుండ్ల గ్రామంలో రైతుల పంట నష్ట అంచనాల ప్రక్రియను పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి పరిశీలించారు. శనగ, కంది పంటలు 33 శాతం కంటే ఎక్కువ క్షేత్రాలను పరిశీలించారు కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి దేవదాసు, వీఆర్వో యువరాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు దిలీప్ కుమార్, కె.రవిబాబు, ఉప సర్పంచ్ రమణారెడ్డి,రైతులు పాల్గొన్నారు.



కేతిముక్కల అగ్రహారంలో ఆర్‌బికె సిబ్బంది, రైతులతో మాట్లాడుతున్న ఐ. మురళి

దెబ్బతిన్న మిర్చి పంటల పరిశీలన

ప్రజాశక్తి-అమరావతి


మండలం పరిధిలోని ధరణికోట, నరుకుళ్ళపాడులలో దెబ్బతిన్న మిర్చి పంటను బుధవారం పల్నాడు జిల్లా ఉద్యాన శాఖ అధికారి బెన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో మిర్చి పొలాలను సందర్శించి పంట నష్ట తీవ్రతను అధ్యయనం చేసి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని రైతులకు, కౌలు రైతులకు నష్టపరిహారం అందేలాగా చూస్తామని అన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి కిషోర్,ఉద్యానవన సహాయకులు శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

డిపార్ట్మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్మెంట్ అండ్ ట్రైనింగ్ వారి అధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాబివృద్ధి సంస్ద నిర్వహించనున్న జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టర్ బంగ్లాలో జాబ్ మేళాకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ జాబ్ మేళాకు కియా మోటార్స్ ఇండియా ప్రై.లిమిటెడ్, తోషిబా ట్రాన్స్మిషన్, హెటిరో డ్రగ్స్ తో పాటు పలు రకాల కంపెనీలు హాజరవుతున్నట్లు చెప్పారు. అభ్యర్ధి విద్యార్హత మేరకు రూ.10 వేలు నుండి రూ .30 వేలు వరకు ఉండవచ్చని తెలిపారు.

పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె. సంజీవరావు మాట్లాడుతూ ఈ నెల 21 న పిడుగురాళ్ళ మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించనున్న జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. 5 వ తరగతి, ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బి.టెక్, డిప్లొమా, ఫార్మసి, పి.జి విభాగాల వరకు చదువుకుని 18 నుండి 45 ఏళ్ల లోపు గల నిరుద్యోగ యువతి యువకులు వారి వివరాలతో ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు,పాస్ పోర్ట్ ఫోటో తో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు skilluniverse/ apssdc.in లో లేదా 9492158153, 7842747682, 9010585 360 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార ్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సిబ్బంది రామాంజ నేయులు, ప్లేస్మెంట్ అధికారి యం.రవీంద్ర నాయక్, కోఆర్డినేటర్ వీరాజజనేయులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శివశంకర్ తదితరులు

విద్యార్థులు ఆటలకు సమయం కేటాయించాలి

ప్రజాశక్తి-నరసరావుపేట

ప్రతి విద్యార్థి తమ దైనందిన జీవితంలో ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి సూచించారు. సత్తెనపల్లి రోడ్ లోని జిల్లా క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న 67వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ - 17 అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి బాల బాలికల అథ్లెటిక్స్ పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రశంశా పత్రాలను అందజేసి అభినందించారు. ఆటలు వలన శారీరక దఢత్వం, మానసిక పునరుత్తేజం కలగడంతో పాటు తోటి క్రీడాకారుల పట్ల స్నేహ పూర్వక సంబంధాలు మెరుగుపడతాయన్నారు.త్వరలో జరగనున్న ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలలో బాలికలు 25 శాతం మాత్రమే దరఖాస్తులు చేసుకున్నారని ఆటల పట్ల బాలికలు భయాన్ని వీడి ధైర్యంగా ముందుకు రావాలన్నారు.



ప్రతిభ చాటిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

'యువతను నట్టేట ముంచిన వైసిపి'

ప్రజాశక్తి - వినుకొండ

జగన్మోహన్‌రెడ్డితో సహా 151 నియో జక వర్గాల్లో సీట్లు మార్చినా అరాచక దోపిడీ వైసీపీ ప్రభు త్వానికి ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పి వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపటం ఖాయమని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి పాలనపై ప్రజలు పూర్తి అసంతృప్తిగా ఉన్నారని అన్నారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తానని చెప్పిన జగన్ రెడ్డి నాలుగేళ్లలో ఒక జాబ్ క్యాలెండర్ ఇవ్వకపోగా డీఎస్సీ నిరు ద్యోగులు కూడా అన్యాయం చేశారని అన్నారు. వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఓటమి భయంతో దొంగ ఓట్లు చేర్చుకొని ఓట్ల జాబితాలో అవుకు తోకలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఓటరు జాబితాలో ఒత్తిళ్లకు లొంగి ఆవకతోకలకు పాల్పడితే బిఎల్వోలు, ఈఆర్వోలు, ఏ ఈ ఆర్ వో లు, తాసిల్దారులతోపాటు అందరి అధికారులు పర్చూరు, ఉరవకొండలా మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. సమావేశం లో పట్టణ పార్టీ అద్యక్షులు పఠాన్ ఆయుబ్ ఖాన్,.మీసాల మురళి కష్ణ యాదవ్.పలేపోగు బలగురవయ్య,రోడ్డా వీరాంజ నేయ రెడ్డి పాల్గొన్నారు.

17న ఉమ్మడి గుంటూరు జిల్లా పురుషుల,మహిళల టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-నకరికల్లు

ఉమ్మడి గుంటూరు జిల్లా పురుషుల,మహిళల టెన్నికాయి ట్ పోటీల ఎంపిక ఈ నెల 17న నకరికల్లు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్షుడు నిడి కొండ జానకి రామయ్య బుధవారం తెలిపారు. ఈ ఎంపికలో 14 ఏళ్లు నిండిన పురుషులు మహిళలు పాల్గొనవచ్చు.వారు ఒరిజినల్ ఆధార్ కార్డ్, రెండు పాస్ ఫోటోలను తీసుకురావాలన్నారు.ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 28,29,30 శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు ఫిజికల్ డైరెక్టర్ సిహెచ్ పుల్లయ్య 9866925108 సంప్రదించాలన్నారు.

ఎఎన్‌యు ఖో-ఖో జట్టుకు ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థి

ప్రజాశక్తి-ఈపూరు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఖోఖో జట్టుకు మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థి జె శ్రీహరి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకటరావు బుధవారం తెలిపారు. ఈనెల 10, 11 వ తేదీలలో పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట విక్టరీ డిగ్రీ కాలేజీలో జరిగిన అంతర్ కళాశాలల ఖోఖో పోటీలలో శ్రీహరి మంచి ప్రతిభ కనబరిచి ఎఎన్‌యు జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. కేరళలో ఈనెల 26న జరిగే అంతర్ విశ్వవిద్యాలయ ఖోఖో పోటీలలో విశ్వవిద్యాలయం జట్టుకు ప్రాతినిధ్య వహిస్తాడన్నారు. శ్రీహరిని కళాశాల సెక్ర టరీ అండ్ కర స్పాండెంట్ మేదరమెట్ల రామ శేషగిరిరావు, అధ్యాపకులు ఆర్ బలరాం నాయక్,దాసు, బిసి హెచ్ అరవింద్ అభినందించారు.

మోడీ,షా తప్పుకోండి

గుంటూరులో కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పార్లమెంటులో దుండగుల దాడికి హోంశాఖ వైఫల్యం స్పష్టంగా కన్పిస్తుందని, సంబంధిత శాఖ మంత్రి అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి డిమాండ్ చేశారు. పార్లమెంటు గ్యాలరీ నుంచి హాలులోకి దుండగులు దూకిన ఘటనపై భద్రతా వైఫల్యమని ఆయన ఆరోపించారు. ఈ ఘటనకు నిరసనగా బుధవారం సాయంత్రం స్థానిక హిందూ కళాశాల జంక్షన్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన తెలిపారు. మస్తాన్ వలీ మాట్లాడుతూ పార్లమెంట్ కు భద్రత కల్పించటంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందన్నారు. నరేంద్రమోడీ, అమిత్ షాతో సహా పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి వెంటనే రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేశారు.21 సంవత్సరాల క్రితం పార్లమెంట్ లో ఇదే తరహా దాడి జరిగిందని మస్తాన్ వలీ గుర్తు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇలాంటి ఘటనలు జరగడం పలు అనుమానాలకు తావిస్తున్నాయన్నారు.

ఓటర్ల అవగాహన సదస్సుకు ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

యువ ఓటర్లకు అవగాహన కల్పించడానికి కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో గురువారం జరగనున్న సదస్సుకు గుంటూరు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తాడేపల్లి మండల తహసీల్దారు నాగిరెడ్డి బుధవారం తెలిపారు. బుదవారం నాడు గుంటూరు జిల్లా డిప్యూటీ కలెక్టర్ కె. స్వప్న కెఎల్ యూనివర్శిటీని సందర్శించి సదస్సు జరగనున్న స్థలాన్ని పరిశీలించారు. కెఎల్ యు విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావుని అడిగి యూనివర్శిటీ వివరాలను తెలుసుకున్నారు. డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు నమోదు పైన యువతీ యువ కులకు అవగాహన కల్పించడానికి కీలక ప్రాం తాల్లో సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు నాలుగువేల మంది యువతీ, యువకులు పాల్గొనడానికి అవకాశం కలిగిన ఎఒటి మైదానాన్ని వారు పరి శీలించారు. విద్యార్థులకు ఓటు పట్ల అవ గాహన కల్పించడానికి క్షేత్ర స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిప్యూటి తహసీల్దారు సతీష్, వడ్డేశ్వరం విఆర్వో ఆషా, గుండిమెడ వీఆర్వో మల్లిఖార్జునరెడ్డి, వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారథి వర్మ తదితరులు పాల్గొన్నారు.


కెఎల్ యులో స్థలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ కె.స్వప్న, చిత్రంలో తహసీల్దార్ నాగిరెడ్డి, హనుమంతరావు తదితరులు


మంగళగిరిలో పర్యటిస్తున్న మురుగుడు హనుమంతరావు

డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణ పరిధిలో హుస్సేన్ కట్ట రోడ్డు మొదలు కొప్పురావు కాలనీలోని 8,9 వ లైను చివరి వరకు డ్రైనేజ్ పారుదలకు సంబంధించి తెలుసుకునేందుకు ఎమ్మెల్సీ, రాష్ట్ర శాసన మండలి ఎథిక్స్ కమిటీ చైర్మన్ మురుగుడు హనుమంతరావు బుధవారం పర్యటించారు. స్థానికులు ఎదుర్కొంటున్న డ్రైనేజ్ సమస్యలపై స్పందిస్తూ కార్పొరేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. సిల్ట్ సమస్యలు, కాల్వలకు మరమ్మత్తులు, స్థంభించిన మురుగును తోడుట, దుర్గంధం లేకుండా చూడాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతూ బ్లీచింగ్ చేయాలని, రెండు రోజులకొకసారి ఫాగింగ్ ఒక పర్యాయం చేసేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు చెప్పారు.

రేపు ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం వేడుకలు వైసిపి దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ రాజన్న నాయకత్వంలో ఈ నెల 15న శుక్రవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఆవరణలో జరుగనున్నట్లు వైసిపి గుంటూరు జిల్లా అధ్యక్షులు నూరు బాషా అల్లా బాషా చెప్పారు. ఈ కార్యక్రమానికి వికలాగులు తరలిరావాలని కోరారు.

అగ్రిగోల్డ్ బాధితుల హామీలు నెరవేర్చండి

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగే వరకూ తమపార్టీ మద్దతు ఉంటుందని సిపిఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ పేర్కొన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలంటూ సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎన్జీరంగా విగ్రహం వద్ద బుధవారం సిపిఐ పొన్నూరు పట్టణ అధ్యక్షులు ఆరేటి రామారావు అధ్యక్షతన అగ్రిగోల్డ్ బాధితుల సత్యాగ్రహ దీక్ష జరిగింది. దీక్షలను అజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు వైఎస్ఆర్‌సిపి పార్టీ ఇచ్చిన హామీల్లో భాగంగా అగ్రిగోల్డ్ బాధితులకు పూర్తిగా చెల్లింపులు చేయాలని, ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకుండా ఉంటే రానున్న ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు.


కిట్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, కమిషనర్

ఆరోగ్యకరమైన జీవనశైలి కోసమే 'ఆడుదాం ఆంధ్రా'

ప్రజాశక్తి-తెనాలి

యువతలో ఆరోగ్యకరమైన జీవన శైలిని పెంపొందించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం నిర్వహిస్తుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై బుధవారం కమిషనర్ అధ్యక్షతన వార్డు సచివాలయం అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, పిఈటీలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ప్రారంభ మౌతుందన్నారు. చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ వాలంటీర్లు క్రీడలపై ఆసిక్తకలవారిని గుర్తించి, కార్యక్రమంలో పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. వార్డు సచివాలయాలకు పంపిణి చేసేందుకు సిద్దంగా ఉన్న క్రీడా సామగ్రిని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో విలీన గ్రామాల పారిశుద్ధ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ను ఆయన కార్యాలయం కలిసి వినతి పత్రం అందజేశారు. తాడేపల్లి మండల పరిధిలోని 10 గ్రామాల పరిస్థితి కార్మికులకు 12 వేల రూపాయలు వేతనం మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. మంగళగిరి, తాడేపల్లి పట్టణాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు రూ.15,000 వేతనం, మెడికల్ అలవెన్స్ రూ.6,000 తో కలిపి రూ.21,000 ఇస్తున్నారని అన్నారు. ఆ విధంగానే విలీన గ్రామాల పారిశుధ్య కార్మికులకు రూ.21,000 వేతనం ఇవ్వాలని విన్నవించారు. యూనియన్ కార్యదర్శి ఎం డేవిడ్, గౌరవ అధ్యక్షులు డి వెంకట్ రెడ్డి, అధ్యక్షులు సిహెచ్ మరియదాసు పాల్గొన్నారు.

నష్టపోయిన పంటల నమోదు ప్రారంభం

ప్రజాశక్తి-పెదనందిపాడు

మిచౌంగ్ తుఫాను ప్రభావంతో నష్టపోయిన పంటల నమోదు ప్రక్రియను ఈరోజు మంగళవారం ప్రారంభించినట్లు మండల వ్యవసాయ అధికారిని బి సుధారాణి తెలిపారు, మిరప పంటకు హెక్టారుకు 17వేల రూపాయలు, బర్లీ పొగాకు హెక్టారుకు 10వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చినట్లు తెలిపారు, శనగ పంట నష్టపోయిన రైతులకు సబ్సిడీ మీద విత్తనాలు త్వరలో ఇస్తామని తెలిపారు, రైతు భరోసా కేంద్రాల పరిధిలో వ్యవసాయ అధికారులు పంట నష్టాన్ని నమోదు చేస్తున్నారని ఆమె తెలిపారు, రైతులకు ఇబ్బంది లేకుండా వ్యవసాయ అధికారులు నమోదు చేయాలని వారికి సూచించారు.


అన్నపర్రు లో పంట నష్టం నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

21, 22 తేదీల్లో మంగళగిరి-తాడేపల్లి బాలోత్సవం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి-తాడేపల్లి బాలోత్సవం రెండో పిల్లల పండుగను విజయవంతం చేసేందుకు నిర్వాహకులు విస్తృతస్థాయిలో చర్యలు చేపట్టారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోగల యర్రబాలెంలోని డాన్ బాస్కో ఉన్నత పాఠశాలలో ఈ నెల 21, 22 తేదీల్లో బాలోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం మంగళగిరి ఎకో పార్కులో ది మంగళగిరి వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులను నిర్వాహకులు కలిసి అసోసియేషన్ తరపున సహాయ సహకారాలు అందించాల్సిందిగా కోరారు. ఈ మేరకు బాలోత్సవం అధ్యక్షులు, నిర్మల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీవీ ప్రసాద్, కోశాధికారి, తాడేపల్లికి చెందిన సీనియర్ జర్నలిస్టు గాదె సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు, సీకే జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ మంచా విజయమోహన రావు, కార్యదర్శి, వీజే జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ ప్రెగడ రాజశేఖర్ లు ఎకో పార్కుకు విచ్చేశారు.

ఈ సందర్భంగా వాకర్స్ రచ్చబండ వద్ద వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల కోటేశ్వరరావు, కార్యదర్శి వీసం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పెద్దిరాజు, వాకర్స్ ప్రతినిధులకు బాలోత్సవం కార్యక్రమ వివరాలను వెల్లడించి అసోసియేషన్ సహకారం కోరారు. డాన్ బాస్కో హైస్కూల్లో ఈ నెల 21, 22 తేదీల్లో సబ్ జూనియర్స్ 3, 4, 5 తరగతులు, జూనియర్స్ 6, 7 తరగతులు, సీనియర్స్ 8, 9, 10 తరగతుల విద్యార్థినీ విద్యార్థులకు కల్చరల్, అకడమిక్ ఈవెంట్లలో విభాగాల వారీగా జరుగుతాయని, విభిన్న రంగాల్లో విద్యార్థినీవిద్యార్థుల్లో దాగివున్న



ప్రతిభాపాటవాలను వెలికితీసేందుకు ఓ పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు బాలోత్సవం నిర్వాహకులు తెలిపారు.

కల్చరల్ ఈవెంట్లలో జానపద నృత్యం, దేశభక్తి, అభ్యుదయ గీతాలు, లఘునాటికలు, శాస్త్రీయ నత్యం, ఏకపాత్రాభినయం, ఫ్యాన్సీ డ్రెస్, విచిత్ర వేషధారణ, కోలాటం, రైమ్స్ పోటీలు విభాగాల వారీగా ఉంటాయి.

అకడమిక్ ఈవెంట్లలో చిత్ర లేఖనం, వ్యాసరచన (తెలుగు, ఇంగ్లీష్), కథారచన (తెలుగు), కవితా రచన, ఉపన్యాసం (తెలుగు, ఇంగ్లీష్), స్వచ్ఛ తెలుగు, పద్యభావం, స్పెల్ బి (ఇంగ్లీష్), మ్యాప్, క్విజ్, మట్టితో బొమ్మలు వంటి అంశాలు విభాగాల వారీగా నిర్వహిస్తారు.

బాలోత్సవం వివరాలు తెలుసుకున్న ది మంగళగిరి వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థినీ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, పోటీతత్వం, స్నేహభావం, సామాజిక స్పృహ ఇత్యాది కల్పించేందుకుగాను మంగళగిరి ప్రాంతంలో నిర్వహిస్తున్న బాలోత్సవానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు.


మాట్లాడుతున్న మంగళగిరి స్వర్ణకారుడు బిట్రా రాఘవేంద్రరావు

'బెంగాలీ స్వర్ణకారుల వల్ల ఉపాధి కోల్పోతున్నాం'

ప్రజాశక్తి-మంగళగిరి

బెంగాలీ స్వర్ణకారుల కారణంగా ఉపాధిని కోల్పోతున్నామని మంగళగిరి షరాఫ్ బజార్ లో బుధవారం స్థానిక స్వర్ణకారులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళగిరికి చెందిన స్వర్ణకారుడు బిట్రా రాఘవేంద్రరావు మాట్లాడుతూ మంగళగిరిలో గత రెండు దశాబ్దాలుగా వేలాది సంఖ్యలో స్వర్ణకార వృత్తిలో ఆధారపడి ఉన్నామని చెప్పారు. కొంత కాలంగా స్థానిక స్వర్ణకారులకు పోటీగా తక్కువ ధరకే బంగారం, వెండి వస్తువులు తయారు చేస్తామని తెలుపుతూ బెంగాలీ కార్మికులు మంగళగిరి ప్రాంతంలో స్వర్ణకార వత్తిని కొనసాగిస్తున్నారని అన్నారు. నిర్దిష్టమైన తయారీ ధరను అమలు చేయకపోవడం వలన స్థానిక స్వర్ణ వత్తిదారులు ఉపాధిని కోల్పోతున్నారని, కుటుంబ పోషణ భారంగా మారుతోందని అన్నారు. కొందరు స్వర్ణకార వృత్తిదారులు ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బెంగాలీ స్వర్ణకారులపై స్థానిక స్వర్ణకార సంఘాలకు తమ సమస్యలను విన్నవించుకున్నపటికీ పెడ చెవిన పెడుతున్నారని అన్నారు.



తాడేపల్లికి చేరుకున్న భగత్‌సింగ్ జన్ యాత్ర

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో బుధవారం భగత్‌సింగ్ జన్ అధికార యాత్ర నిర్వహించారు. నవజీవన్ భారత్ సభ, దిశ విద్యార్థి సంఘం తదితర సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 10న కర్ణాటకలో ప్రారంభమైన యాత్ర బుధవారం తాడేపల్లి చేరుకుంది. మతం పేరుతో బిజెపి, ఆర్ఎస్ఎస్ హిందూత్వ ఫాసిజనానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేయడానికే యాత్ర చేపట్టినట్లు శ్రీనివాసరావు తెలిపారు. సమస్యల గురించి ప్రజలను ఆలోచింపజేయకుండా దేశంలో మత ఉద్రిక్తతలు సృష్టిస్తున్న బిజెపిని ఎండగట్టాలని కోరారు. నిరుద్యోగం, ధరల పెరుగుదుల, అవినీతి వంటి సమస్యలకు పెట్టుబడిదారీ విధానమే కారణమని చెప్పారు.


మాట్లాడుతున్న ఏపిఎం ఎం సుబ్బారావు

మహిళల రక్షణపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-పెదనందిపాడు

మహిళలపై జరుగుతున్న దాడులను, అఘాయిత్యాలను అరికట్టాలని మండల ఏపీఎం ఎమ్ సుబ్బారావు పిలుపునిచ్చారు. ప్రజ్వల ఎన్జీవో టీమ్ ఆధ్వర్యంలో బుధవారం పెదనందిపాడు మండల సమైఖ్య కార్యాలయంలో అవగాహన సదస్సు జరిగింది. ముందుగా మహి ళల సంరక్షణ గురించి షార్ట్ ఫిలిం ప్రదర్శించి అవగాహన కల్పించారు, అనంతరం మండల సమైక్య సర్వసభ్య సమావేశం నిర్వ హించారు, కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షులు సిహెచ్ శ్యామల, అధికారులు షేక్ ఖాజాబీ, జి హైమావతి, వి.శ్రీనివాసరావు, వి.సుబ్బారావు, షేక్ అరుణాదేవి తదితరులు పాల్గొన్నారు.

24 మంది స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ కింద ఎంపికైన 24 మంది స్టాఫ్ నర్సులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు బుధవారం డిఎంహెచ్‌ఓ ఛాంబర్‌లో నియామక పత్రాలు అందచేశారు. వారిలో ముగ్గురిని జిజిహెచ్‌లోని ఎన్ఐసియుకి, 21 మందిని జిజిహెచ్‌కి, అలాగే బాపట్ల ఏరియా హాస్పిటల్‌లోని ఎస్ఎన్‌సియుకి కేటాయించారు.


నియామక పత్రాలు అందచేస్తున్న డిఎంఅండ్‌హెచ్‌ఓ ఎ.శ్రావణ్‌బాబు

క్లైయిమ్‌లన్నీ సక్రమంగా విచారణ : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాలో ఎస్ఎస్ఆర్ 2024లో భాగంగా డిసెంబరు 9వ తేదీ వరకు అందిన అన్ని క్లైయిమ్‌లను క్షేత్రస్థాయిలో సక్రమంగా విచారించి పరిష్కరించి 2024 జనవరి 5వ తేదీన ప్రచురించే తుది ఓటర్ల జాబితాలో అప్డేట్ చేయటం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలిశర్మ, డిఆర్‌ఓ కె.చంద్రశేఖర్‌రావుతో కలసి ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆప్ నాయకులు డాక్టర్ టి.సేవాకుమార్, బిఎస్‌పి నాయకులు సిహెచ్.వాసు, బిజెపి నాయకులు ఆర్.భాస్కరరావు, కాంగ్రెస్ నాయకులు బి.సునీల్, టిడిపి నాయకులు కె. శివరామయ్య, వైసిపి నాయకులు ఎ.జోసఫ్‌కుమార్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఫిర్యాదులను క్లైయిమ్‌ల రూపంలో స్వీకరించటం జరుగుతుందని, ఒకే వ్యక్తి ఐదు కంటే ఎక్కువగా నమోదు చేసిన క్లైయిమ్‌లను పూర్తి స్థాయిలో విచారించటం జరుగుతుందని, ఉదేశ్యపూర్వకంగా అందించిన తప్పుడు క్లైయిమ్‌లపై చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.ఎస్ఎస్ఆర్ 2024 డ్రాఫ్ట్ జాబితా తరువాత క్లైయిమ్ లను డిసెంబరు 24వ తేదీ నాటికి పరిష్కరించేలా క్షేత్రస్థాయిలోని బూత్ లెవల్ అధికారులతో నిరంతరం పర్యవేక్షించాలన్నారు.సమావేశంలో ఈఆర్వోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎ.రవిందరరావు, లక్ష్మీకుమారి, ఆర్డీవో శ్రీకర్, జిఎంసి అడిషనల్ కమిషనర్ కె.లక్ష్మీశివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎంలపై అవగాహనకు మొబైల్ వాహనాలు

ప్రజాశక్తి-గుంటూరు



జెండా ఊపి ప్రారంభిస్తున్న కమిషనర్

నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గ ఓటర్లకు ఈవిఎం, ఓటర్ వెరిఫికేషన్, పేపర్ ఆడిట్ పై అవగాహన కల్గించేందుకు ప్రత్యేకంగా మొబైల్ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ. కీర్తి చేకూరి తెలిపారు.బుధవారం జిఎంసి ప్రధాన కార్యాలయంలో అవగాహన వాహనాలను కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల ఓటర్లకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవిఎం), ఓటర్ వెరిఫికేషన్, పేపర్ ఆడిట్‌పై అవగాహనకు ఇప్పటికే జిఎంసి ప్రధాన కార్యాలయం, బందావన్ గార్డెన్స్‌లోని సర్కిల్ కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్గించేందుకు మొబైల్ వాహనాలను కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. వాహనం వెంబడి పోలీస్ బందోబస్త్ ఉంటుందని, శిక్షణ పొందిన సిబ్బంది అందుబాటులో ఉండి ఈవిఎం ద్వారా ఓటు వేయడం, సరి చూసుకోవడం తదితర అంశాల పై అవగాహన కల్గిస్తారని తెలిపారు. ఓటర్లు తమ ఓటుకు సంబంధించిన ఏ సందేహం ఉన్నా తీర్చడానికి వీలుగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ని ఏర్పాటు చేశామన్నారు. తూర్పు నియోజకవర్గానికి 0863-2345104, పశ్చిమ నియోజకవర్గానికి 2345105 నంబర్లను ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా ఆపరేటర్లను నియమించామన్నారు. ఓటర్లు ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:30 గంటల లోపు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌ఓ, అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివ జ్యోతి, ఏఈఆర్‌ఓలు సి,హెచ్. శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, మేనేజర్ శివన్నారాయణ పాల్గొన్నారు.

మలినేని ఫార్మసీలో తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

పుల్లడిగుంటలోని మలినేని పెరుమాళ్ళ ఫార్మసీ కాలేజిలో మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియం క్యారీ, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ సయ్యద్ అహ్మద్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలేజి చైర్మన్ మలినేని పెరుమాళ్ళ మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో ఉపాధి అవకాశాల గురించి వివరించారు. డాక్టర్ అహ్మద్ భాషా మట్లాడుతూ యువతపై సోషల్ మీడియా ప్రభావం గురించి వివరించారు. డాక్టర్ విలియం క్యారీ మాట్లాడుతూ విదేశాల్లో ఫార్మశీ రంగానికి మంచి భవిష్యత్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాసకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఫార్మసీ విభాగాధిపతి జి.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు, కాలేజి చైర్మన్, తదితరులు

10వ తరగతి మోడల్ పరీక్ష పుస్తకం ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే యుటిఎఫ్ ఆధ్వర్యంలో 25 ఏళ్లుగా 10 తరగతి మోడల్ పరీక్ష పుస్తకం ప్రచురణ ముద్రించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. స్థానిక కలెక్టర్ బంగ్లాలో బుధవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో తెలుగు మరియు ఇంగ్లీష్ మాధ్యమాలలో ప్రచురించిన 10 వ తరగతి మోడల్ పేపర్ పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఆసక్తిగా పుస్తకాన్ని తిలకించి అందులోని అంశాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో 1లక్ష మోడల్ పుస్తకాలు ప్రచురించడం పట్ల యుటిఎఫ్ ఉపాధ్యాయులను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ యుటిఎఫ్ అన్ని సబ్జెక్టులను కలిపి ప్రచురించిన మోడల్ పేపర్ పుస్తకం చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థుల లో పరీక్షల పట్ల భయాన్ని పోగొట్టడంతో పాటు షుమారు 60 శాతం పైగా యుటిఎఫ్ ప్రచురించిన పుస్తకంలోని ముఖ్యమైన అంశాలే పరీక్షలలో వస్తున్నాయన్నారు. వెనుకబడిన ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో నిరుపేద విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. లాభాపేక్షకు ఎటువంటి తావు లేకుండా వెనుకబడిన విద్యార్థులు కూడా ఉత్తీర్ణత సాధించేలా చేయటమే లక్ష్యంగా యుటిఎఫ్ మోడల్ పుస్తకాన్ని ప్రచురించింది అన్నారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులు యుటిఎఫ్ ప్రచురించిన మోడల్ పుస్తకం విద్యార్థులతో చదివించేలా చొరవ చూపాలన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి యుటిఎఫ్ తనవంతు విద్య పరంగా సేవా కార్యక్రమాలు పోరాటాలు చేస్తూనే ఉంటుందన్నారు. నేటి నుండి పల్నాడు జిల్లాలోని 13 యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయాలలో మోడల్ పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. వివరాలకు యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి ప్రేమ్ కుమార్ 9441049281, జిల్లా ప్రధాన కార్యదర్శి జి విజయ సారధి 9949918906 నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, సహాధ్యక్షులు ఎం. మోహనరావు, ఏ భాగేశ్వరిదేవి, జిల్లా కార్యదర్శులు శ్రీనివాసరావు ,ఓ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిఆర్‌డిఎ పథకాలపై ప్రాంతీయ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రాజశేఖర్

జిల్లాలలో డీఆర్డీఏ-వైయస్సార్ క్రాంతి పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాల అమలుపై గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, ఎన్‌టీఆర్ , కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, పీడీడబ్ల్యు , డిపియండబ్ల్యు , కాంపోనెంట్ హెడ్‌లతో బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాల్‌లో ప్రాంతీయ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పంచాయితీ రాజ్ రూరల్ డెవలప్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, సెర్ప్ సిఇఒ సిఈఓ, సిసిఎల్ఏ, మైనారిటీ వెల్ఫేర్ సెక్రటరీ ఏ.ఎండి.ఇంతియాజ్ అహ్మద్, స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ నాంచారయ్య, సెర్ప్ అడిషనల్ సిఈఓ విజయలక్ష్మీ , జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రెటరీ బి.రాజ శేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో ఏపి జిల్లాలలో ఏమేమి సమస్యలు వున్నాయో తెలుసుకోవడానికి ప్రాంతీయ సమీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళలను వ్యాపారవేత్తలుగా చేసేందుకు నిర్వహిస్తున్న మహిళా మార్ట్‌లు విజయవంతంగా నడుస్తున్నాయని , అందుకు అందర్నీ అభినందిస్తున్నానని చెప్పారు. వ్యాపారంలో లాభ నష్టాలు వస్తుంటాయని, వ్యాపారం చేస్తున్న మహిళలను జాగ్రత్తగా చూసుకోవాలని, లోన్ రికవరీలు సక్రమంగా చెల్లించే విధంగా చూడాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల పిల్లలు ఉన్నత చదువులు చదువుతున్నారని తెలుపుతూ, ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా డీఆర్డీఏ - వైయస్సార్ క్రాంతి పథకం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఏ.ఎండి.ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందించిన రుణాలు సక్రమంగా చెల్లించేలా చూడాలన్నారు. ఎనిమిది జిల్లాల నుండి వచ్చిన పీడీ లు డీఆర్డీఏ - వైయస్సార్ క్రాంతి పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని పేద ప్రజలకు కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందిస్తున్న పథకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో పీడీ డీఆర్డీఏ హరిహరనాథ్ , డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వివిఐటి బాలోత్సవానికి విశేష స్పందన



ముగింపు సభావేదికపై డాక్టర్ హేమచంద్రారెడ్డి, విద్యాసాగర్ తదితరులు


మట్టిబొమ్మల తయారీలో విద్యార్థులు

ప్రజాశక్తి-తెనాలి : ప్రతిభ అందరిలోనూ ఉంటుందని, దానిని వెలికి తీసి ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాల నంబూరులో ఈనెల 11 నుంచి నిర్వహించిన ప్రపంచ తెలుగు బాలల పండుగ బాలోత్సవ్ బుధవారం అంగరంగ వైభవంగా ముగిసింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులకు మధురమైన అనుభూతిని మిగిల్చింది. మూడు రోజుల పాటు నిర్వహించిన వివిద పోటీలను వీక్షించేందుకు వేలాది మంది హాజరయ్యారు. చివరి రోజైన బుధవారం ఏర్పాటు చేసిన శాస్త్ర సాంకేతిక ప్రదర్శన శాలను డాక్టర్ హేమచంద్రా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిఐటి అధినేత, బాలోత్సవ్ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో 20 అంశాలకు సంబందించి 61 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు తోడు రెండు ప్రత్యేక బహుమతులను అందించారు. డాక్టర్ కె.హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ బాలల వికాసం, సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేసేందుకు నిర్వహి ంచిన బాలోత్సవ్ ఎంతో ప్రతిష్టాత్మకంగా సాగిందన్నారు. తొలిరోజు నుంచి విశేష ఆదరణ చూరగొందన్నారు. ప్రతి విభాగంలోనూ విద్యార్థుల ప్రదర్శన ఎంతో అద్బుతంగా ఉందన్నారు. చైర్మన్ విద్యాసాగర్ మాట్లాడుతూ చివరి రోజున విచిత్ర వేషధారణ, శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు జరిగాయని, నృత్య బృందాలు రెండు వేదికలపై అలరించాయన్నారు. ఆయా బృందాల ప్రదర్శన జాతర వాతావరణాన్ని సృష్టించిందన్నారు. అలాగే విచిత్ర వేషధారణలో చిన్నారులు ఎంతగానే సందర్శకులను ఆకర్షించారన్నారు. సమాజానికి హితవు పలికేలా బాలోత్సవ్ సాగిందన్నారు. ఏపి అధికార భాషా సంఘం, తెలుగు బాషాభివృద్ది ప్రాదికార సంస్థ అధ్యక్షులు పి.విజయ్ బాబు మాట్లాడుతూ భారతీయ కళలు, సంస్కృతి మనిషిలోని శారీరక, మానసిక రుగ్మతలను దూరం చేస్తాయన్నారు. విద్యార్థుల మనోవికాసానికి దోహదపడే విదంగా బాలోత్సవ్ నిర్వహించిన చైర్మన్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. చైర్మన్ విద్యాసాగర్‌తో కలిసి విజేతలకు బహుమతులు అందించారు.

జానపద నృత్యంలో విద్యార్థులు




సాంస్కృతిక ప్రదర్శనలో చిన్నారులు